

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

**చూస్తూ చూస్తూ ఫైనల్ ఎగ్జామ్స్** దగ్గర పడ్డాయి. ఎప్పటిలానే కేంపస్ కిటకిటలాడుతూ ఉంది. లైబ్రరీ నిండా జనాలు. లాస్ట్ మినిట్ చదివేవాళ్ళు బుక్స్ వెతకడం కూడా ఈసారి గమనించాను. ఇదే కొంతమందికి లాస్ట్ సెమిస్టర్. వాళ్ళు చలాకీగా ఉన్నారు. కొంతమందికి ఉద్యోగం వచ్చింది, కొంతమంది కన్సల్‌టెన్సీలో చేరారు. మరికొందరు ఇండియాకి తిరిగి వెళ్ళిపోతున్నారు.

"నాకు బీ ప్లస్ వచ్చినా సరిపోతంది" అని ఒకరు, "నాకు ఇందులో కూడా 'ఏ' వస్తే జీపీఏ నాలుగుంటుంది" అని మరొకరు. రకరకాల మనస్థత్వాలు చూసాను. "కన్సల్టెన్సీలో జాబ్ వస్తే నేను కేలిఫోర్నియాకి వెళ్తాను. అప్పుడు నాకు కట్నం ఇంకా పెరుగుతుంది" అని ఒకడు, "హార్వర్డ్‌లో పి.హెచ్.డి కి వెళ్తున్నాను" అని మరొకరు. ఎగ్జాంమ్స్ కి చదవాలి,

అన్న చింత కన్నా తరవాత ఏం చెయ్యాలి అనే చింత ఎక్కువగా కనపడింది. హనీషలాంటివాళ్ళు ఉద్యోగానికి ప్రయత్నం కూడా చెయ్యలేదు.

"అందరూ అమెరికా అమెరికా అనడం వల్ల వచ్చాను" అనో "ఇంట్లో వాళ్ళవల్లే చదువుతున్నా" అనో, "ఇప్పుడు మంచి సంబంధాలు" వస్తాయి అనో అనేవాళ్ళు చాలామందే ఉన్నారు.

"ఎగ్జామ్స్ అయ్యాక అక్కడికి వెళ్ళాలి", "ఎగ్జామ్స్ అయ్యాక ఇది చెయ్యాలి" అనేవారు మరికొందరు. నిజానికి ఆ చెయ్యాలి అనుకున్నవి వారు ఎప్పుడైనా చెయ్యొచ్చు. అందువల్ల వారు అవి ఎప్పటికీ చెయ్యరని అనుకున్నాను. ఉదాహరణకి ఎగ్జామ్ అయ్యాక రోజూ జిమ్ కి వెళ్తాను, లేదా ఇంట్లోనే బ్రెడ్ తయారు చేస్తాను, పుస్తకాలు చదువుతాను, స్పానిష్ నేర్చుకుంటాను లాంటివి. అవి ఎప్పటికీ చేయరని వారికి కూడా తెలుసని నా అనుమానం.

ఎగ్జామ్స్ పూర్తయ్యాక ఇండియాకి వెళ్ళేవాళ్ళు షాపింగ్ హడావిడిలో పడ్డారు. రాం వాళ్ళ అమ్మకి, చుట్టాలకి షాపింగ్ చేసాపెందుకు సహాయం కోరాడు. నేను, రామ్, హనీష టిజెమాక్స్‌కి వెళ్ళి ఆమెకోసం ఒక హేండ్‌బ్యాగ్, చుట్టాల్లో అమ్మాయిలకి నెయిల్ పాలిష్లు, ఫేస్ మాస్కులు, రకరకాల జుట్టు క్లిప్పులు కొన్నాం. హనీష పనిలో పని తన షాపింగ్ కూడా చేసింది. తరవాత పిజ్జా హట్‌లో తినడానికి వెళ్ళాము. నాకు, హనీషకి తనే కొన్నాడు. మాటల్లో తను తిరిగి వచ్చాక యూనివర్సిటీ ట్రాన్స్‌ఫర్ అవుతున్నాడని చెప్పాడు. అదేంటి అని అడిగాము.

తనకి వేరే యూనివర్సిటీలో పి హెచ్ డికి అడ్మిషన్ వచ్చిందని, ఆ ప్రొఫెసర్ తన ఫీల్డ్ లో చాలా గొప్ప వ్యక్తి అని, తనకింద పనిచేస్తే మంచి ఉద్యోగం ఖాయం అని చెప్పాడు. తను ఇదివరకు రాసిన రీసెర్చ్ పేపర్‌ని పంపి ఆ తరవాత అప్లై చేసాడట. ప్రొఫెసర్‌తో మాట్లాడి ట్రాన్స్‌ఫర్‌కి పర్మిషన్ తీసుకున్నా అని చెప్పాడు. ఇప్పుడు సమయం లేకపోవడం వల్ల అఫిషియల్‌గా నమోదు కాలేదని, తిరిగి వచ్చాక వెళ్ళిపోతానని చెప్పాడు. ఎందుకో కాస్త బాధగా అనిపించింది.

"ఇంకా చదవడం ఏంటో నాకైతే అసలు అర్థంకాదు. మాస్టర్స్ ఒక్కటి రోజులు లెక్కపెడుతూ పూర్తి చేస్తున్నాను" హనీష అంది.

చిన్నగా నవ్వాడు.

"నిజంగానే అడుగుతున్నా" అంది.

"మా తాతయ్య,నాన్న ఇద్దరూ డాక్టరేట్ సంపాదించారు. ఇద్దరూ చాలా కష్టపడేవారు, అంతా గౌరవించేవారు. వారు పోయాక అదంతా కూడా పోయింది. వాళ్ళకి ఇచ్చినంత గౌరవం మా అమ్మకి ఇవ్వలేదు. అది స్పష్టంగా అర్థమవ్వడంతో అమ్మ బాగా కృంగిపోయింది. తాతయ్యవల్ల, నాన్నవల్ల వచ్చిన గౌరవం తిరిగి నావల్లే వస్తుంది. మా చుట్టాల్లో చదువు లేకపోతే పురుగులా చూస్తారు. ఎంత ఇష్టమయిన బంధువులు పిలిచినా అమ్మ పెళ్ళిళ్ళకి, పేరంటాలకి వెళ్ళడం పూర్తిగా మానేసింది. ఓ వైపు నుండి జాలి చూపేవారు, మరో వైపు నుండి కించపరిచేవారు. అమ్మ మళ్ళీ వాళ్ళతో

సంతోషంగా కలవాలి అంటే నేను మా నాన్నంత వాడిని కావాలి. అందుకే అమెరికాలో ఉన్న బెస్ట్ ప్రొఫెసర్ దగ్గర చేరాలనుకుంటున్నాను" అన్నాడు. నేను ఏడుపు ఆపుకోలేకపోయాను. హనీష కళ్ళు కూడా తడయ్యాయి.

"మరి అలాంటి వాళ్ళకి గిఫ్ట్‌లు ఎందుకు కొన్నావు?" హనీష కాస్త కోపంగా అడిగింది.

"మా నాన్న బ్రతికుంటే పెదనాన్నకి అది తీసుకునిరా, అత్తకి ఇది తీసుకునిరా అనేవారు. చదువులేదని వారు అలా చేసారే తప్ప వేరే కక్షవల్లకాదు. వాళ్ళ ఉద్దేశం ప్రకారం మా అమ్మ చదువుకున్నది ఎందుకూ పనికిరాదు. నిజానికి తను సోషియాలజీ చదివింది. నిజంగా దాని వల్ల ఏం ఉపయోగం లేదు. మా నాన్న మీద ప్రేమ వల్లే అమ్మ చదువుమీద కోపం. అయినా ఓ మూడు నాలుగు సంవత్సరాల్లో అంతా కలిసి పోతాం కదా, ఆ రోజు అది తెచ్చి ఉండాల్సింది అనే బాధ ఎందుకూ?" కన్నుకొట్టి నవ్వాడు.

తిరిగి ఇంటికి వచ్చేంత సేపు నేను నిశ్శబ్దంగానే ఉండిపోయాను. వెళ్ళగానే నేను నిద్రపోయాను.ఏదో నీళ్ళలో కొట్టుకుపోతూ ఊపిరాడక చెట్టుకి వేలాడిన కల వచ్చింది. దాంతో మెలుకువ వచ్చాక రెండు క్షణాలు గట్టిగా ఊపిరి పీల్చాను. చుట్టూ చీకటి. రాత్రయ్యిందో పొద్దునవుతుందో తెలీలేదు. ఫోన్‌లో టైం అయిదుంపావు అయ్యింది. పగలు కాదు, సాయంత్రం అని తారీకు బట్టి అర్థమైంది. అంటే దాదాపు మూడున్నర గంటలు పడుకున్నాను. ఇంతలో నేహ వచ్చింది. నేను అప్పుడే నిద్రలేవడం గమనించి జ్వరంగా ఉందా అని అడిగింది. లేదని చెప్పాను. సెలవల్లో తను కూడా ఇమిడియాకి వెళుతుంది. వాళ్ళ అమ్మా నాన్నతో కలిసి సౌత్ ఇండియా టూర్‌కి వెళుతున్నా అని చెప్పింది. కేరళలో వాళ్ళు వెళ్ళే కొన్ని చోట్ల ఫోటోలు చూపించింది. నేను చిన్నప్పుడు పెద్దమ్మ వాళ్ళతో వెళ్ళినప్పటి విశేషాలు చెప్పాను. ముఖ్యంగా పెద్దమ్మ అక్కడ మళయాళం మాట్లాడుతున్న ఆవిడ పీలిక జుట్టుని చూసి "పాపం కేరళలో కొబ్బరి నూనె వంట తింటూ కూడా ఆవిడ జుట్టు ఎంత పల్చగా ఉందో" అన్న సంఘటనకి ఇద్దరం నవ్వాము. వాళ్ళు కేరళలో ఓ మూడురోజులు ఉండబోయే పడవ వీడియోలు చూపించింది. ఎంతో అద్భుతంగా ఉంది అది. అన్నయ్యకి చెప్పి మేము కూడా వెళ్ళాలని తనని ఫోటోలు పంపమన్నాను.

అందరిలా తను చుట్టాలకి ఏమీ కొనట్లేదు. నాకు కాస్త ఆశ్చర్యంగా అనిపించి అదేంటి అని అడిగాను. వాళ్ళ అమ్మా, నాన్నలిద్దరికి అక్క చెల్లెళ్ళుకానీ అన్నదమ్ములు కానీ లేరట. దాంతో ఉన్న బంధువులంతా దూరపు చుట్టాలే. వారితో పెద్దగా కలవకపోవడం వల్ల కేవలం వాళ్ళ అమ్మా నాన్నకి కావల్సినవి తీసుకువెళుతుందట. ఎందుకో కాస్త జాలేసింది. చుట్టాలతో కలిసి సమ్మర్ హాలీడేస్‌లో అమ్మమ్మ ఊరికి వెళ్ళడం, ముద్దలు కలిపి చేతిలో పెట్టించుకోవడం, వానలో ఎవరి పడవ ఎక్కువ దూరం వెళుతుందని పందెం కాయడంలాంటివి నేహకి తెలియదు. చుట్టాల పెళ్ళిళ్ళకి మీలా కొన్ని రోజులముందే వెళ్ళి సహాయం చేయడం, వాళ్ళ పీటల వెనకాల కూర్చోడం వంటివి కూడా తెలీదు. అందరి పెళ్ళిళ్ళకి, గృహప్రవేశాలకి, కేవలం గెస్ట్‌లా వెళ్ళి కొద్దిసేపు ఉండి తిరిగి రావడమే తనకి తెలుసు. దాంతో నేను కేవలం వాళ్ళ కేరళ

ప్రయాణం గురించే చర్చించాను. ఇంతలో అన్నయ్య ఫోన్ చేసాడు. నేహ తన గదిలోకి వెళ్ళిపోయింది. అన్నయ్యకి రామ్ గురించి చెప్తూ తిరిగి ఏడ్చాను. అలాగే నిదానంగా నేహ గురించి కూడా చెప్పాను.

"నీకెందుకే అందరి గురించి? ఎవరి జీవితం వాళ్ళది" అన్నాడు.

"అలాకాదన్నయ్య. నేనేం అడగలేదు. కానీ వాళ్ళు అలా చెపితే నాకు చాలా జాలేసింది" అన్నాను.

"అది వాళ్ళకి అలవాటే. నేహకి అసలు చుట్టాలు ఉంటే ఎలా ఉంటుందో తెలియదు. అలాంటప్పుడు లేకపోతే ఏం మిస్ అవుతుందో ఎలా తెలుస్తుంది? ఇది ఎలా ఉందంటే అమ్మ ఇంట్లో ఉండి మాస్టర్స్‌కి చదువుతున్న అమ్మాయి నిన్ను చూసి జాలి పడినట్టుంది."

"నన్ను చూసెందుకు జాలి పడుతుంది? నేను బానే ఉన్నాను" అన్నాను.

"నిజమే. కానీ నీ వంట నువ్వే చెయ్యాలి, నీ గిన్నెలు నువ్వే తోమాలి. పాపం ఇవన్నీ చేస్తూ చదువుకోవాలంటే ఎంత కష్టపడుతుందో అని నిన్ను  చూసి ఎవరైనా జాలిపడితే నీకు ఎలా నచ్చదో, వాళ్ళకి కూడా అలానే నచ్చదు. నీ ప్రాబ్లమ్స్ పక్కన పెట్టి వాళ్ళ ప్రోబ్లమ్స్ వల్ల బాధపడకు" అన్నాడు.

నిజమే అనిపించినా పేచీ పెట్టబుద్దైంది.

"నాకేం  బాధలు లేవు. అయినా నేనేమీ వాళ్ళ మొహం మీద జాలిపడను" అన్నాను.

"నీ మొహం ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ మైండ్‌లా ఉంటుంది."

"ఏం ఉండదు."

"ఇంతకీ సమ్మర్‌లో ఏం చేస్తున్నావు? నన్ను టికెట్ కొనమంటావనుకున్నాను. అడగకపోయేసరికి ఫ్రెండ్స్‌తో ఎక్కడికైనా వెళుతున్నారనుకున్నా. ఎగ్జామ్స్ అయ్యాక అడుగుదామని ఆగాను."

"ఎక్కడికీ లేదు. ఇక్కడే ఉంటున్నాను"

"అదేంటి?"

"సమ్మర్‌లో థీసిస్ మీద పని చేస్తానని చెప్పా ప్రొఫెసర్‌కి. మూడు నెలలు క్లాసులు లేకుండా కేవలం థీసిస్ చేస్తే కాస్త తొందరగా అయిపోతుందని".

"ఓ మంచిదే. త్వరగా గ్రాడ్యుయేట్ అవుతావా అయితే?"

"అవుదామనుకుంటున్నాను. చూడాలి ఏమవుతుందో."

"మంచి నిర్ణయమే తీసుకున్నావు."

అన్నయ్యతో ఫోన్ పూర్తయ్యాక నేహ గదిలోకి వెళ్ళాను. తను పెట్టె సర్దింది. సహాయం కావాలా అని అడిగాను. ఎప్పటిలానే ఇది చెయ్యి, అది చెయ్యి అని పనులిచ్చింది. బహుశా చుట్టాలు లేకపోవడం వల్ల మొహమాటం, మాట

వరసలాంటివి తనకి తెలియవనుకుంటాను. కొద్దిసేపు సర్దాక తను మా ఇద్దరికి సూప్ వండడం మొదలుపెట్టింది. ఎప్పటిలానే నేను కూరగాయలు తరిగాను. ఈసారి తను పన్నీర్ ముక్కల్ని చిన్నగా వేయించి, అందులో ఉల్లిపాయలు, కాప్సికం, బఠాణీలు వేయించి కొద్దిసేపటికి టమాటాలు వేసింది. అవి వేగేసరికి కొంత వెజిటబుల్ బ్రాత్, కొంత నీళ్ళు పోసింది. బ్రాత్‌లో ఎక్కువ సోడియం ఉండడం వల్ల సగం నీరు కలుపుతుందట. నీళ్ళు కాగే సమయానికి కార్న్ పౌడర్ వేసి కలిపింది. అది చిక్కగా అయ్యే సమయానికి స్టవ్ ఆపేసి వెనిగర్, ఉప్పు, పెప్పర్ వేసి కలిపింది. ఆ తరవాత రెండు నిమిషాలకి కొంత నిమ్మకాయ రసం పిండి ఇద్దరికి రెండు గిన్నెల్లో పోసింది. ఎంతో రుచిగా ఉన్న ఆ సూప్‌ని తన సూట్‌కేస్‌కి అటువైపు ఒకరు, ఇటు వైపు ఒకరు నేలమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ గంటసేపు తిన్నాము. ఆ తరవాత తిరిగి తన సూట్‌కేస్‌ని కబుర్లు చెప్పుకుంటూ సర్దడం పూర్తి చేసాం.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story